# కేసీఆర్ గెలుపుతో శాశ్వత అభివృద్ధి



ఎమ్మెల్సీ కవితతో రెడ్డి ఐక్యవేదిక నాయకులు

- అగ్రవర్ణాలతో సహా అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి
- రెడ్డి ఐక్యవేదిక నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

కామారెడ్డి, అక్టోబర్ 27 : సీఎం కేసీఆర్ గెలుపు కామారెడ్డికి మరింత శక్తిని ఇస్తుందని, ఈ ప్రాంతం శాశ్వత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కామారెడ్డి ప్రాంతం రూపురేఖలు మారుతాయని, కామారెడ్డి జిల్లానే కాకుండా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు పొరుగున ఉన్న జిల్లాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన రెడ్డి ఐక్యవేదిక నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో శుక్రవారం సమావేశమయ్యారు.

కామారెడ్డిలో సీఎం కేసీఆర్ అభ్యర్థిత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కామారెడ్డిలో సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నారని ప్రకటించగానే కార్యకర్తల్లో ఉత్సాహం వచ్చిందన్నారు. ప్రత్యేకాభివృద్ధి నిధులతో కావాల్సినంత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. పరిశ్రమలు, సంస్థలు వస్తాయని, దీంతో కామారెడ్డితోపాటు నిజామాబాద్ జిల్లాలో ఉపాధి అవకాశాలకు ఢోకా ఉండబోదని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేసి గెలవడంతో కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అగ్రవర్ణాలతోసహా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని అన్నారు. కామారెడ్డిలో భారీ మెజార్టీతో సీఎం కేసీఆర్‌ను గెలిపించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి రాజాబహద్దూర్ వెంకట్రాంరెడ్డి ట్రస్టుకు ప్రతిపాదించిన రెండు ఎకరాల భూమిని ఐదు ఎకరాలకు పెంచి కేటాయిస్తామని ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని రెడ్డి ఐక్యవేదిక నాయకులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భూకేటాయింపు త్వరగా జరిగేలా తాను చొరవ తీసుకుంటానని కవిత సానుకూలంగా స్పందించారు.

**అగ్రవర్ణ పేదలకు గురుకులాల ఏర్పాటుపై ఐక్యవేదిక నాయకులు హర్షం..**

నియోజకవర్గానికి ఒకటి చొప్పున అగ్రవర్ణ పేదల కోసం గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో చేర్చడంపై రెడ్డి ఐక్యవేదిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్ రెడ్డి, రాజాబహద్దూర్ వెంకట్రాంరెడ్డి ట్రస్ట్ చైర్మన్ నాగర్తి చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి, నాయకులు గంగారెడ్డి, రమేశ్‌రెడ్డి, రాంరెడ్డి, మల్లారెడ్డి, భీమ్‌రెడ్డి, నర్సారెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, ఏలేటి రాంరెడ్డి, మల్లారెడ్డి, నవీన్ రెడ్డి, నర్సారెడ్డి, మధుసూదన్ రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగుపై రైతులు ఆసక్తి చూపాలి

- నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ దీప్తి
- నగరంలో ప్రారంభమైన తెలంగాణ ఆర్గానిక్ మేళా

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 27 : సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపాలని నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ దీప్తి అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నాబార్డు, సాయి వెజిటేబుల్ ఫ్రూట్స్ గ్రోయర్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఆర్గానిక్ మేళాను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేందుకు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పండించిన పంట ఉత్పత్తులను విక్రయానికి అందుబాటులో ఉంచాలని రైతులకు సూచించారు. అఖిల భారత ప్రముఖ్ కుమారస్వామి మాట్లాడుతూ.. రైతులు సంఘటితంగా ఏర్పడి సేంద్రియ పంటల ఉత్పత్తులను సాగు చేయాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సాయి వెజిటేబుల్ ఫ్రూట్స్ అండ్ గ్రోయర్స్ సంస్థ చైర్మన్ కొండెల సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్గానిక్ మేళా మూడురోజులపాటు నిర్వహిస్తామని తెలిపారు. మేళాలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర నుంచి వచ్చిన రైతులు సేంద్రియ పద్ధతిలో పండించిన వివిధ రకాల పంట ఉత్పత్తులను 30స్టాళ్ల ద్వారా ప్రదర్శనగా ఉంచారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్, నాబ్ కిసాన్ బీడీఎం నవీన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



ఆర్గానిక్ మేళాను ప్రారంభిస్తున్న నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ దీప్తి

# ప్రభుత్వ దవాఖానలకు అవార్డులు

**బాన్సువాడ మాతా శిశు దవాఖానకు మూడు, నిజామాబాద్ జీజీహెచ్‌కు ఒకటి**



అవార్డును చూపుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, వైద్యులు

బాన్సువాడ/ ఖలీల్‌వాడి, అక్టోబర్ 27 : ప్రభుత్వ దవాఖానలు అందించిన సేవలకు ఉత్తమ అవార్డులు అందాయి. బాన్సువాడలోని బాన్సువాడ మాతా శిశు దవాఖానకు ఒకేసారి మూడు అవార్డులు ముస్కాన్, లక్ష్య, నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎంక్వాస్) వచ్చాయి. దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్.. సిబ్బందితో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దవాఖానకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యంతోపాటు దవాఖానను పరిశుభ్రంగా ఉంచడంతో 2023 సంవత్సరానికి గాను ఈ అవార్డులు వచ్చాయని వివరించారు. దవాఖాన అభివృద్ధికి దవాఖాన చైర్మన్, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కృషిచేయడంతోనే అవార్డులు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ, గైనకాజిలస్టు డాక్టర్ సుధ, దవాఖాన నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణవేణి, హెడ్‌నర్సులు శాంతకుమారి, సుబ్బాయమ్మ, భవానీ, మల్లీశ్వరి, అమృత, ఆరోగ్య జ్యోతి, ఫార్మాసిస్టు శ్రీనివాస్, టీపీసీటీ వైద్యురాలు శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానకు వాబా (మలేసియా) అండ్ బీపీఎన్ఐ (భారత్) సంస్థలు ఉత్తమ అవార్డును అందజేశాయి. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు –2023లో భాగంగా ఆగస్టు ఒకటి నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు గాను అవార్డును అందజేసినట్లు తెలిపారు. సమావేశంలో వైద్యులు కవిత, శ్రీనివాస్, గోపాల్‌సింగ్, రాజశేఖర్, నిరూప్‌రెడ్డి, దీపక్, రాథోడ్ పాల్గొన్నారు.




అవార్డులను చూపుతున్న బాన్సువాడ దవాఖాన సూపరింటెండెంట్ , వైద్యులు

# చెదురుతున్న 'హస్త' రేఖలు

- కాంగ్రెస్‌లో బయటపడుతున్న లుకలుకలు
- నియోజకవర్గాల్లో పెరిగిన అసంతృప్త రాగాలు
- ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్లనే అభ్యర్థుల ప్రకటన
- రెండో జాబితాలోనూ షబ్బీర్‌అలీకి దక్కని చోటు
- ఇప్పటికే కారెక్కుతున్న కాంగ్రెస్ ముఖ్యనాయకులు
- బీఆర్‌ఎస్ అధినేతపై పోటీకి కాంగ్రెస్‌లో భయాందోళన



నిజామాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను తట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీ ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా ఇబ్బందులు పడుతున్నది. పూర్తిస్థాయిలో ఎన్నికల రణక్షేత్రంలోకి దిగకముందే చేతులు ఎత్తేసే దుస్థితి హస్తం పార్టీకి ఎదురవుతున్నది. సగానికి ఎక్కువ నియోజకవర్గాల్లో కనీసం అభ్యర్థులే లేకపోవడంతో పోలింగ్ తేదీకి నెల రోజుల ముందు కూడా చర్చోపచర్చల పేరుతో సాగదీస్తున్నారు. ఎవరైనా ఇతర పార్టీల నుంచి తమ పార్టీలోకి జంపింగ్ జపాంగ్‌లు వస్తే వారికే పెద్దపీట వేసి, అసెంబ్లీ స్థానాలను కట్టబెట్టే దుస్థితికి కాంగ్రెస్ దిగజారడంతో ప్రజల్లో ఒకరకమైన చర్చ మొదలైంది. ఇదిలా ఉండగా.. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో పీసీసీ ముఖ్య నాయకులంతా ఆగమాగం అవుతున్నారు. మొన్నటివరకు తాడోపేడో అంటూ తొడలు కొట్టిన వారికే కనీసం మొదటి, రెండో దఫా జాబితాలో చోటు దక్కకపోవడంతో నవ్వులపాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కామారెడ్డి నుంచే పోటీ చేస్తా.. నేనెటూ పారిపోనంటూ షబ్బీర్‌అలీ ప్రకటనలు ఇచ్చినప్పటికీ.. ఏఐసీసీ వెలువరించిన రెండో జాబితాలోనూ ఆయన పేరు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

**కేసీఆర్ రాకతో కాంగ్రెస్‌లో వణుకు...**

అసెంబ్లీ ఎన్నికల రణరంగంలో కాంగ్రెస్ పార్టీ పోటీకి ముందే చేతులెత్తేసిన పరిస్థితి నెలకొన్నది. పోలింగ్ తేదీకి సరిగ్గా నెల రోజులే ఉన్నప్పటికీ.. ఇంతవరకు అభ్యర్థుల వేటలోనే హస్తం పార్టీ మునిగి తేలుతున్నది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 9 నియోజకవర్గాలకుగాను ఇప్పటివరకు కేవలం 5 నియోజకవర్గాలకే అభ్యర్థులను ఖరారు చేశారు. కామారెడ్డి నుంచి పోటీకి సై అంటూ సవాల్ విసిరిన పీసీసీ ముఖ్యనాయకుడు షబ్బీర్‌అలీ పేరును కనీసం రెండో జాబితాలోనూ చేర్చకపోవడంతో హస్తం శ్రేణులు గందరగోళంలో పడ్డారు. కేసీఆర్ రాకతో షబ్బీర్‌కు భయం పట్టుకున్నదని, పోటీ చేసేందుకు భయపడుతున్నారంటూ సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. సొంత పార్టీ నేతలే ఈ వ్యాఖ్యలు చేస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఇదిలా ఉండగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జనార్దన్ గౌడ్ గులాబీ కండువా కప్పుకున్నారు. ఏఐసీసీ అభ్యర్థుల జాబితాను ప్రకటించిన క్షణాల్లోనే ఈ చేరిక జరగడం విశేషం. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి గతంలో ఉపఎన్నికల్లో విజయం సాధించిన జనార్దన్ గౌడ్‌ను పార్టీలోకి గులాబీ పార్టీ సాదరంగా ఆహ్వానించింది. ఇప్పటికే గులాబీ పార్టీలో మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు సైతం కొనసాగుతున్నారు. వీరంతా కలిసి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ గెలుపు కోసం కృషి చేయబోతున్నారు.

**వారికి భంగపాటు...**

హస్తం పార్టీలో అసెంబ్లీ సీట్లను పొందాలని భావించి, చివరకు నిరాశే ఎదురైన వ్యక్తులంతా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 2018, 2023 ఎన్నికల్లో వరుసగా చివరిదాకా పోటీలో నిలబడేందుకు తలబడిన వ్యక్తి.. ఇప్పుడు పార్టీ మారేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతోపాటు పనిచేసే వారిని గుర్తించేవారు కరువయ్యారన్న బాధలో సదరు నేతలు కొట్టుమిట్టాడుతున్నట్లుగా తెలుస్తున్నది. త్వరలోనే కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, ఇతర పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధం అవుతున్నట్లుగా తెలిసింది. నిజామాబాద్ రూరల్‌లో కాంగ్రెస్ పార్టీ తీరు నవ్వులపాలవుతున్నది. మాజీ ఎమ్మెల్సీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కన్నేసిన ఈ స్థానంలో డాక్టర్ భూపతిరెడ్డికి ఏఐసీసీ సీటు ఖరారు చేయడంతో మిగిలిన వారంతా రగిలిపోతున్నట్లుగా సమాచారం. ఒక మాజీ ఎమ్మెల్సీ గతంలో టీడీపీలో పనిచేశారు. స్వరాష్ట్రంలో ఆ పార్టీ కనుమరుగు కావడంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. గులాబీ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి అసెంబ్లీ సీటుపై కన్నేశారు.

ఆశించిన ఫలితం రాకపోవడంతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తున్నది. వీరైతే మరో పార్టీ జెండాను పట్టుకునే పనిలో ఉన్నట్లు సమాచారం. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌గా పనిచేసి, నిజామాబాద్ రూరల్ నుంచి పోటీ చేయాలని భావించిన మరో నాయకుడు సైతం తీవ్ర నిరాశలో మునిగినట్లు సమాచారం. ఇక ఆర్మూర్ నియోజకవర్గంలో మొన్నటివరకు బీజేపీ జెండా మోసిన వ్యక్తికి ఆకస్మాత్తుగా హస్తం పార్టీ టికెట్ రావడంపైనా పార్టీలో సీనియర్ లీడర్లు తీవ్రంగా అధిష్టానం వైఖరిని తప్పుపడుతూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా కలహాల కుంపటితో కాంగ్రెస్ పార్టీ త్వరలోనే రోడ్డెక్కి, నిరసనల వరకు చేరే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఎల్లారెడ్డిలో కాంగ్రెస్‌కు షాక్

- బీఆర్‌ఎస్‌లోకి మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్
- కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి కేటీఆర్



ఎల్లారెడ్డి, అక్టోబర్ 27 : ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బి.జనార్ధన్‌గౌడ్ కాంగ్రెస్‌ను వీడి కారెక్కారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో ఆయన శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రామారావు జనార్ధన్‌గౌడ్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జనార్ధన్‌గౌడ్‌కు సముచిత స్థానం కల్పిస్తామని, గతంలో ఇచ్చిన హామీని కచ్చితంగా నెరవేరుస్తామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఎల్లారెడ్డి అడ్డ తొలినుంచి బీఆర్‌ఎస్ గడ్డ అని, 2001లో పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన అన్ని ఎన్నికల్లో గులాబీ పార్టీ గెలుపొందిందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**గెలుపు మరింత సులువు..**

25 ఏండ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్న జనార్ధన్‌గౌడ్‌కు నియోజకవర్గంలో మంచి పట్టుంది. 1990లలో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 1999, 2004లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. 2008లో జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించిన జనార్ధన్‌గౌడ్‌కు 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఇవ్వకుండా మొండిచేయి చూపింది. దీంతో ఆయన బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే జాజాల సురేందర్ తరఫున ప్రచారం చేసి గెలిపించారు. జనార్ధన్‌గౌడ్‌కు ఎనిమిది మండలాల్లోనూ పెద్ద సంఖ్యలో అనుచరులు ఉన్నారు. ప్రతి గ్రామంలో గౌడ సంఘాలతో మంచి అనుబంధం ఉంది. ఇది వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు మరింత అనుకూలంగా మారనున్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పాతికేండ్ల రాజకీయ అనుభవమున్న జనార్ధన్‌గౌడ్ బీఆర్‌ఎస్‌లో చేరడం ద్వారా అధికార పార్టీకి మరింత కలిసి వస్తుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.